క్లుప్తంగా

కంబాలపల్లి క్లస్టర్ ఏఈఓగా అభిలాష్

చందంపేట : మండలంలోని కంబాలపల్లి క్లస్టర్ ఏఈఓగా అభిలాష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ విధులు నిర్వర్తించిన వనజ చందంపేట క్లస్టర్‌కు బదిలీ కాగా ఆమె స్థానంలో అభిలాష్ బాధ్యతలు చేపట్టినట్లు ఏఓ మల్లారెడ్డి తెలిపారు.

కోటమైసమ్మ ఆలయ హుండీ లెక్కింపు


హుండీ లెక్కిస్తున్న సిబ్బంది, అధికారులు

నిడమనూరు : మండలంలోని తుమ్మడం కోమైసమ్మ ఆలయ హుండీని హుండీని శుక్రవారం లెక్కించారు. ఈ సందర్భంగా రూ. 9,08, 520 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ నవీన్‌కుమార్ తెలిపారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి జులై 28వ తేదీ వరకు సంబంధించిన హుండీని లెక్కించినట్లు తెలిపారు. దేవాదాయశాఖ సహాయ కమిషనర్ మహేంద్ర కుమార్, చైర్మన్ చౌటిఆంజనేయులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

జీఓ నంబర్ 46ను రద్దు చేయాలి


అమరవీరుల స్థూపం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న అభ్యర్థులు

మిర్యాలగూడ టౌన్ : తెలంగాణ స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంటు బోర్డులో ప్రభుత్వం తీసుకువచ్చిన జీఓ నంబర్ 46ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం పోలీసు నియామక అభ్యర్థులు అమరవీరుల స్థూపం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు అభ్యర్థులు మాట్లాడుతూ పోలీస్ నియామకాల్లో ఉత్తీర్ణతను సాధించిన గ్రామీణ అభ్యర్థుకు తీవ్రంగా నష్టం వాటిళ్లుతుందన్నారు. ప్రభుత్వం ఈ జీఓను తక్షణమే రద్దు చేసి, పాత పద్ధతిలోనే నియమకాలను చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అభ్యర్థులు ఎం. విజయ్, టి. వినయ్‌బాబు, బి.అజయ్, టి. నాగరాజు, టి. ఖర్జూర్, హరి, డి. నాగరాజు, బి. స్వామి, రవి పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయాలి


నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

మిర్యాలగూడ అర్బన్ : తడకమళ్ల రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ నాయకులు శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆపార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రోడ్డును తవ్వి కంకర, డస్ట్ పరిచారని దీంతో వాహనాలు వెళ్లలేని పరిస్థితిలో ఉందన్నారు. వర్షాలు కురుస్తుండడంతో రోడ్డంతా అధ్వానంగా తయారైందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గువ్వల శేఖర్, జానపాటి శ్రీను, నక్క వెంకన్న, సైదులు, అంజయ్య, రామలింగం, వీరస్వామి, యాదిరెడ్డి తదితరులున్నారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం


లైట్లను ప్రారంభిస్తున్న ఎంపీపీ

కొండమల్లేపల్లి : మండలంలోని గుమ్మడవెల్లి గ్రామంలో ఎంపీపీరేఖశ్రీధర్‌రెడ్డి సొంత నిధులతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్‌ను శుక్రవారం ఎంపీపీ ప్రారంభించి మాట్లాడారు. గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు. కాగా సొంత నిధులతో హైమాస్ట్ లైట్ ఏర్పాటు చేయడం పట్ల గ్రామస్తులు ఎంపీపీ రేఖశ్రీధర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

పాఠశాలలో మోటారు చోరీ

గుర్రంపోడు : ప్రాథమిక పాఠశాల ఆవరణలో గల సంపులోని ఓపెన్‌వెల్ కరెంటు మోటారును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. ఈ ఘటన గుర్రంపోడు మండలంలోని కట్టవారిగూడెం గ్రామంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. మన ఊరు మన బడిలో భాగంగా ఆవరణలోని బోరుకు ఇటీవలే 11 వేల రూపాయల ఖర్చు చేసి ఓపెన్ వెల్ మోటారును కొనుగోలు చేసి బిగించారు. పైపును కత్తిరించి దొంగలు మోటారును ఎత్తుకుపోయారు. ఈ మేరకు గుర్రంపోడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సర్పంచ్ చాడ చక్రవర్తి తెలిపారు.

పొలాల నడుమ డంపింగ్ యార్డు

- బావుల్లో, చేలల్లో పేరుకుపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు
- నారుమళ్లను ధ్వంసం చేస్తున్న పందులు
- ఇబ్బందులు పడుతున్న రైతులు


చెత్తతో నిండిన సెగ్రిగేషన్ షెడ్డు


పొలాల్లో కవర్లు, చెత్తాచెదారం

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలోని చెత్తను తరలించేందుకు ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డు పొలాల మధ్య ఉండడం.. దీంతో ఇష్టారీతిన చెత్తను పడేస్తుండడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. వ్యవసాయ బావుల్లో, పొలాల్లోకి వచ్చి చేరుతున్న ప్లాస్టిక్ వ్యర్థాలకు తోడు.. పందులు నారుమళ్లను ధ్వంసం చేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని స్థానిక పచ్చర్ల బావి సమీపంలో గల ఫిష్ మార్కెట్ భవనం పక్కన రైతుల పొలాల మధ్యన డంపింగ్ యార్డును రూ.14.30లక్షలతో 2022 సంవత్సరంలో ఏర్పాటు చేశారు. ఈ డంపింగ్ యార్డులో తడి, పొడి చెత్తతో పాటు కంపోస్టు ఎరువుల తయారీకి గాను ఏర్పాట్లు చేశారు. అయితే చెత్తను ఇష్టారీతిన పడేస్తుండడంతో రైతులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ చెత్త గాలికి తమ పొలాలకు కొట్టుకురావడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, పొలాల మధ్యన డంపింగ్ యార్డు ఏర్పాటు చేయడం వల్ల పందులు స్వైర విహారం చేస్తూ నారుమళ్లను ధ్వంసం చేస్తున్నాయని రైతులు వాపోతున్నారు. దీనికి తోడు భరించలేని దుర్గంధం వెదజల్లుతుందని పేర్కొంటున్నారు. డంపింగ్‌యార్డులో కొబ్బరి బొండాలు, ప్లాస్టిక్‌వ్యర్థాలు తమ వ్యవసాయ పొలాలకు చేరడంతో పాటు బావుల్లో వ్యర్థాలు పేరుకుపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై కొండమల్లేపల్లి, జానిగానితండా సర్పంచులు, ఆయా పంచాయతీ కార్యదర్శులకు పలుమార్లు విన్నవించుకున్న పట్టించుకోవడం లేదని, దీంతో ఏం చేయాలో పాలుపోవడం లేదని చెబుతున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి డంపింగ్ యార్డును సరైన పద్ధతిలో వినియోగించడమో లేదా సమీప దూరంలో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవడం లాంటి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాలతో ఇబ్బందులు



నాకు రెండు ఎకరాల పొలం పక్కనే ఈ డంపింగ్ యార్డు ఉంది. దీంతో నా పొలంలోకి ప్లాస్టిక్ వ్యర్థాలు చెత్తాచెదారం వస్తున్నాయి. బోరు బావిలో సైతం ప్లాస్టిక్ కవర్లు పేరుకుపోయాయి. రాత్రిపూట ఈ డంపింగ్‌యార్డులో పందులు స్వైర విహారం చేస్తూ నారుమళ్లను పాడుచేస్తున్నాయి. అధికారులు, స్వంచులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైన ఉన్నతాధికారులలు స్పందించి డంపింగ్ యార్డును సక్రమంగా వినియోగించేలా చూడాలి.

పాత్లావత్ రామచంద్రు, పాత్లావత్‌తండా, జానిగాని తండా గ్రామపంచాయతీ

పోడు పట్టాల పంపిణీలో దేశానికే ఆదర్శం

- ఎమ్మెల్యే రవీంద్రకుమార్


పోడు పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

దేవరకొండ : పోడు పట్టాలు పంపిణీ చేయడంలో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. శుక్రవారం దేవరకొండ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పోడు భూములకు సంబంధించిన పట్టాలను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. ఎన్నో ఏళ్ల నాటి గిరిజనుల కలను సాకారం చేసిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దన్నారు. దశాబ్దాల పోడు భూముల సమస్యకు ముఖ్యమంత్రి కేసీఆర్ శాశ్వత పరిష్కారం చూపినట్లు తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన తెలిపారు. గడిచిన తొమ్మిదేళ్లలో గిరిజనుల అస్థిత్వాన్ని గుర్తించింది తెలంగాణ ప్రభుత్వమన్నారు. ఈ కార్యక్రమంలో డిండి ఎంపీపీ మాధవరం సునీతాజనార్ధన్‌రావు, బోయపల్లి శ్రీనివాస్‌గౌడ్, అర్వపల్లి నర్సింహ, వేముల రాజు, వడ్త్య బాలు, నాగు, యాదగిరి, బొడ్డుపల్లి కృష్ణ, ఆయా మండలాల తహసీల్దార్‌లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

వినియోగదారుల మన్ననలు పొందాలి


మహిళా సమాఖ్య సభ్యులతో ఎమ్మెల్యే భాస్కర్ రావు

మిర్యాలగూడ : వినియోగదారులకు మెరుగైన సేవలు అందించి వారి మన్ననలు పొందాలని ఎమ్మెల్యే భాస్కర్ రావు సూచించారు. దామరచర్ల గ్రామంలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో తెలంగాణ ఎస్‌హెచ్‌జీ స్టోర్స్–ఎఫ్‌పీఓ ఫర్టిలైజర్ దుకాణాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఫర్టిలైజర్ దుకాణాన్ని ప్రారంభించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ కాళిందిని, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ నారాయణరెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సంపత్, వైస్ చైర్మన్ వీరకోటిరెడ్డి, ఎండీ.యూసుఫ్, కోటిరెడ్డి, హనిమిరెడ్డి, ఎంపీడీఓ జానయ్య, నేనావత్ బాలునాయక్, ఫయాజ్, శంకర్ పాల్గొన్నారు.

గిరిజనుల మధ్య చిచ్చు పెట్టేందుకు బీజేపీ కుట్ర


సమావేశంలో మాట్లాడుతున్న ట్రైకార్ చైర్మన్ రామచంద్రనాయక్

మిర్యాలగూడ : గిరిజనుల మధ్య చిచ్చు పెట్టేందుకు బీజేపీ ఎంపీ సోయంబాబురావు కుట్ర చేస్తున్నాడని ఆలిండియా బంజారా సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ట్రైకార్ రాష్ట్ర చైర్మన్ ఇస్లావత్ రామచంద్రనాయక్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎన్‌ఎస్పీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణలో లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని సోయం బాబురావు చెప్పడం దారుణమన్నారు. ఇప్పటికే సుప్రీంకోర్టులో పిటీషన్ వేశారని లంబాడీల, ఆదివాసీల మధ్య చిచ్చు పెట్టేందుకు కుట్రలకు పాల్పడుతన్నారని ఆరోపించారు. ఇప్పటి వరకు లంబాడీలు, ఆదివాసీలు కలిసిమెలసి ఉన్నారని అలాంటి వారి మధ్య చిచ్చు పెట్టాలని చూడడం దుర్మార్గమైన చర్య అన్నారు. 20 సంవత్సరాలు పోరాడి సాధించుకున్న రిజర్వేషన్‌ను తొలగించి గిరిజనులకు అన్యాయం చేయాలని బీజేపీ కుట్రలకు పాల్పడుతుందన్నారు4శాతం ఉన్న రిజర్వేషన్‌ను సీఎం కేసీఆర్ పదిశాతంకు పెంచి వారి అభివృద్ధికి కృషి చేశారన్నారు. ఇప్పటికే నాలుగు ఐటీడీఏలను ఏర్పాటు చేశారని దాని ద్వారా ఆదివాసీలు ఎంతో లబ్ధి పొందుతున్నారన్నారు. ఇప్పుడిప్పుడే గిరిజనులు అభివృద్ధి చెందుతున్నారని అది చూసి ఓర్వలేకుండా ఉన్నారన్నారు. మణిపూర్‌లో గిరిజన తెగల మధ్య చిచ్చు పెట్టిన విధంగా తెలంగాణాలో కూడా కుట్రలకు పాల్పడితే ఊరుకునేది లేదన్నారు. వెంటనే రిజర్వేషన్‌ను తొలగించే ప్రయత్నాన్ని మానుకోవాలన్నారు. సమావేశంలో చిట్టిబాబునాయక్, భిక్షానాయక్, భాషానాయక్, శ్రీహరినాయక్, పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

మిర్యాలగూడ టౌన్ : రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రి చికిత్స పొందుతున్న స్నేహితుడు వెంకటేశ్వర్లుకు తన తోటి స్నేహితులు రూ.20వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వెంకటేశ్వర్లును కొండ్రపోలు జెడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థులు పరామర్శించి ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పరంగి వెంకటేశ్వర్లు మిత్రులు చంద్రశేఖర్, మధు, కోటి, లక్ష్మయ్య, నాగయ్య, మోహన్, పుష్ప, వాని, నర్సమ్మ, పావని తదితరులు పాల్గొన్నారు.


స్నేహితుడికి ఆర్థిక సాయం అందజేస్తున్న మిత్రులు

సమస్యలపై గళమెత్తిన కౌన్సిలర్లు


సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్

దేవరకొండ : దేవరకొండ మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం శుక్రవారం రసాభాసాగా జరిగింది. మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పలువురు కౌన్సిలర్లు ఆయా వార్డుల్లో నెలకొన్న సమస్యలపై సమావేశంలో గళమెత్తారు. పట్టణంలో దెబ్బతిన్న అంతర్గత సీసీ రోడ్లకు మరమ్మతులు చేయాలంటూ పలువురు కౌన్సిలర్లు సమావేశంలో లేవనెత్తారు. పట్టణంలోని 20వ వార్డులో అంతర్గత డ్రెయినేజీ నిర్మాణ పనులతో సీసీ రోడ్లు దెబ్బతిన్నాయనీ దీంతో రోడ్లపై వర్షపునీరు వచ్చి చేరడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయంటూ స్థానిక కౌన్సిలర్ కొండ్ర మల్లీశ్వరీ శ్రీశైలంయాదవ్ సభ దృష్టికి తీసుకెళ్లారు. 9వ వార్డు కౌన్సిలర్ హన్మంతు వెంకటేష్‌గౌడ్ మాట్లాడుతూ మున్సిపాల్టీలో చేపట్టే అభివృద్ధి పనులను పాలకవర్గానికి సంబంధం లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై ఆయా వార్డుల కౌన్సిలర్లు సమావేశంలో చర్చించారు. అనంతరం పట్టణంలో చేపట్టే పలు అభివృద్ధి పనులకు సంబంధించి తీర్మానాలు చేసినట్లు కమిషనర్ వెంకటయ్య తెలిపారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ రహత్‌అలీ, ఆయా వార్డుల కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన ఉండాలి



పెద్దవూర : ఓటింగ్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

మిర్యాలగూడ అర్బన్ : ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రం(ఈవీఎం) ద్వారా ఓటు వేసే విధానంపై అవగాహన ఉండాలని ముత్తిరెడ్డి కుంట కౌన్సిలర్ పత్తిపాటి సంజాతనవాబ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని 19వ వార్డులో ఓటు వేసే విధానంపై ఏర్పాటు చేసిన ఈవీఎం, వీవీప్యాడ్‌ల డెమో ఓటింగ్‌ను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఈకార్యక్రమంలో మొబైల్ అవేర్నేస్ టీం ఇన్‌చార్జ్ ఎం. శేషయ్య, సెర్ప్ ఏపీఎం శంకర్, కానిస్టేబుల్ ధనుంజయ, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

పెద్దవూర : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఎలక్ట్రానిక్ ఓటింగ్‌పై శుక్రవారం మండల ప్రజలకు డిప్యూటీ తహసీల్దార్ రంగారెడ్డి అవగాహన కల్పించారు. 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. 150 మందికి ఎలాక్ట్రానిక్ ఓటింగ్ పరికరం ద్వారా అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ దండ శ్రీనివాస్‌రెడ్డి, యంఎస్ఓ సాలయ్య, రాజశేఖర్, శ్రీనివాస్, సతీష్, పాదిల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పేదలకు అండగా బుసిరెడ్డి ఫౌండేషన్


నిడమనూరు : ఆర్థిక సాయం అందజేస్తున్న పాండురంగారెడ్డి

నిడమనూరు: పేదలకు అండగా బుసిరెడ్డి ఫౌండేషన్ ఉంటుందని ఆ ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగా రెడ్డి తెలిపారు. మండలంలోని వేంపాడ్, వెంగన్నగూడెం, గుంటిపల్లి, జంగాలవారి గూడెం, గగ్గినపల్లివారి గూడెం, కుమ్మరి గూడెంలలో 22 పేద కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున ఆర్థిక సాయం అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దిలీప్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటరమణ, సర్పంచ్‌లు స్వాతి, రవి, శ్రావణ్‌కుమార్ రెడ్డి, సుభాష్ రెడ్డి, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

వేములపల్లి : నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని వెనుకబడిన కుటుంబాలకు తనవంతుగా ఆర్థిక సాయం అందజేస్తానని బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి అన్నారు. శుక్రవారం మాడుగులపల్లి మండలంలోని కన్నెకల్, ధర్మాపురం, శాంతినగర్, గోపాలపురం, దేవునిగోపాలపురం, మాచనపల్లి, కేశాపురం, నారాయణపురం, గారకుంటపాలెం గ్రామాల్లోని 23 మందిపేదలకు రూ.5వేల చొప్పున ఆర్థిక సాయం అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తిరుమలగిరి(సాగర్) వైస్ ఎంపీపీ యడవెల్లి దిలీప్‌రెడ్డి, నాయకులు అంకతి వెంకటరమణ, సర్పంచ్‌లు అనితావెంకన్న గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, యాదగిరిరెడ్డి, యాదయ్య, జూలకంటి పద్మశ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, అనితావెంకన్న, శ్రీనివాస్‌రెడ్డి, పమ్మి జనార్ధన్‌రెడ్డి, జ్యోతిరామకృష్ణనాయక్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆదేశాలను వెనక్కి తీసుకోవాలి

దేవరకొండ: ప్రభుత్వ విద్యాసంస్థల్లోకి డీఈఓ అనుమతి లేకుండా ఎవరూ వెళ్లకూడదంటూ విద్యాశాఖ డైరెక్టర్ దేవసేన ఇచ్చిన ఆదేశాలను వెనక్కి తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ దేవరకొండ డివిజన్ కార్యదర్శి బుడిగ వెంకటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. అప్రజాస్వామ్యానికి విరుద్ధంగా విద్యాశాఖ ఆదేశాలు ఇవ్వడం సరికాదనిన్నారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడాన్ని ఖండిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆదేశాలు వెనక్కి తీసుకోకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రమావత్ లక్ష్మణ్, ఆంజనేయులు, అశోక్, చందు, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పంచాయతీ కార్మికుల సమ్మె


నిడమనూరులో ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు


వేములపల్లి : పంచాయతీ కార్మికులకు భోజనాన్ని అందజేస్తున్న బీఎల్‌ఆర్


కొండమల్లేపల్లి : సమ్మెలో పాల్గొన్న కార్మికులు

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లిలో గ్రామపంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారంతో 23వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా పలువురు కార్మికులు మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని, కనీస వేతనం అమలు చేయాలని, మల్టీపర్పస్ విధానాన్ని అమలు చేయాలనిఇ తదితర డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కోట్ల సతీష్, జిల్లా ఉపాధ్యక్షులు ప్రవీణ్, కార్యదర్శి గుండాల వెంకటయ్య, లక్ష్మణ్ పాల్గొన్నారు.

వేములపల్లి : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద 23 రోజులుగా సమ్మె చేస్తున్న పంచాయతీ కార్మికులకు ప్రతి రోజూ మధ్యాహ్న భోజనాన్ని అందజేస్తామని మిర్యాలగూడ కాంగ్రెస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బీఎల్‌ఆర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులకు మధ్యాహ్న భోజనాన్ని అందజేసి ఆయన మాట్లాడారు. పంచాయతీ కార్మికులు ఇన్ని రోజులుగా సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రంలో కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పుట్టల కృపయ్య, నాయకులు శ్రీనివాస్, రవీందర్ రెడ్డి, రామచంద్రయ్య, దైదగిరి, చంటి, మహమ్మద్, సోహెల్, ముజామిల్, నవీద్ పాల్గొన్నారు.

నిడమనూరు : గ్రామ పంచాయతీ కార్మికులు శుక్రవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. తమ డిమాండ్లను నేరవేర్చాలని గ్రామ పంచాయతీ కార్మికులు సమ్మె బాట పట్టారు. తమ డిమాండ్లను సత్వరమే నెరవేర్చాలని వారు కోరుతున్నారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు కోటేశ్వరరావు, సత్యనారాయణ, రాములు, విజయ్, పుల్లయ్య, కృష్ణ, లింగయ్య, పాల్గొన్నారు.

వైద్యసిబ్బందిపై చర్యలు తీసుకోవాలి

నాగార్జునసాగర్ : స్థానిక కమలా నెహ్రూ ఆస్పత్రిలో విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమల్ల వెంకటేశం కోరారు. పైలాన్ కాలనీలో ఇటీవల మృతి చెందిన శిశువు తల్లిదండ్రులను పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. బిడ్డ చావుకు కారణమైన నర్సులను విధుల నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంటనే ఆ పార్టీ నియోజకవర్గ ఉపాధ్యక్షులు బత్తుల ప్రసాద్, కన్వీనర్ బైరాగి విజయ, పెద్దవూర మండల అధ్యక్షులు ముత్యాలు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం


విరాళం అందజేస్తున్న రంజిత్ యాదవ్

హాలియా : మండలంలోని చల్మారెడ్డిగూడెంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ నిర్మాణానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మన్నెం రంజిత్ యాదవ్ శుక్రవారం రూ.20వేల విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రంజిత్ యాదవ్‌ను ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించి, అభినందించారు. ఈ కార్యక్రమంలో చల్మారెడ్డిగూడెం మాజీ సర్పంచ్ కోరెపాక మారయ్య, కమిటీ సభ్యులు ఏర్పుల కోటయ్య, యడవల్లి అంజయ్య, చెన్నయ్య, ముత్తయ్య, వెంకన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఐఐటీ విద్యార్థికి ఎమ్మెల్యే సన్మానం


విద్యార్థికి స్వీటు తినిపిస్తున్న ఎమ్మెల్యే భగత్



కలెక్టర్‌కు మొక్క అందజేస్తున్న ఎమ్మెల్యే భగత్

హాలియా : తిరుమలగిరి(సాగర్) మండలం నాయకునితండాకు చెందిన మేరావత్ బాలచందర్ ఐఐటీ జేఈఈ మెయిన్స్‌లో ఆలిండియాలో ఉత్తమ ర్యాంక్ సాధించి ఐఐటీ ఖరగ్‌పూర్‌లో ఇంజనీరింగ్ విభాగంలో సీటు సాధించాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నోముల భగత్ శుక్రవారం హాలియా పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి బాలచందర్‌ను పిలుపించుకొని శాలువాతో సన్మానించి అభినందించారు. .ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, ప్రసన్న, గిరి, సోమయ్య, ముజాహిద్, ఆంజనేయులు, సుధాకర్ ఉన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే

నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆర్.వి.కర్ణన్‌ను శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మొక్కను అందజేసి శాలువాతో సన్మానించారు.

అభివృద్ధి పనులు నాణ్యతతో చేపట్టాలి


మాట్లాడుతున్న కమిషనర్ రమణాచారి

నల్లగొండ టూటౌన్ : పట్టణంలోని 48వ వార్డులో చేస్తున్న అభివృద్ధి పనులు నాణ్యతతో చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ కేవీ.రమణాచారి అన్నారు. శుక్రవారం పట్టణంలోని 48వ వార్డు ఎన్టీఆర్ విగ్రహం నుంచి శివాజీనగర్ రోడ్‌లో రూ.70 లక్షలతో నిర్మిస్తున్న డ్రెయినేజీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. వర్షాలు కురుస్తున్నందున ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం ఎన్జీ కాలనీ పార్కులో హరిత శుక్రవారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి నీరు పోశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ యామ దయాకర్, మున్సిపల్ ఏసీపీ నాగిరెడ్డి, డీఈలు అశోక్, వెంకన్న, ఏఈ దిలీప్, రవీందర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్‌లో శాంతి నెలకొల్పాలి

నల్లగొండ టూటౌన్ : మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న హింసాత్మక ఘటనలను అరికట్టాలని, రాష్ట్రంలో అల్లర్లు జరుగకుండా శాంతి నెలకొల్పాలని కోరుతూ అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జిల్లా యాదయ్య, కట్టా వెంకట్‌రెడ్డి కేంద్రాన్ని డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని పెద్ద గడియారం సెంటర్‌లో నిరసన చేపట్టారు. జిల్లా ఉపాధ్యక్షులు వెంకట్‌రెడ్డి, డాక్టర్ ఏ.ఏ. ఖాన్, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

దేవరకొండ: నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు. దేవరకొండ మండలం తాటికోల్ వాగు నుంచి శుక్రవారం రెండు ట్రాక్టర్లలో కొండమల్లేపల్లికి ఇసుకను తరలిస్తుండగా పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో పట్టుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

రోడ్డంతా గుంతలమయం



జాతీయరహదారిపై ఏర్పడిన గుంతలు

పెద్దవూర : మండల కేంద్రంలోని జడ్చర్ల–నాగార్జునసాగర్ జాతీయ రహదారిపై వంతెన వద్ద ఏర్పడిన గుంతలు ప్రమాదకరంగా మారాయి. ఒక్కో గుంత రెండు ఫీట్ల మేర ఏర్పడి అందులో వర్షపు నీరు నిలస్తున్నాయి. దీంతో ఆ గుంత ఎంతో లోతు ఉందో తెలియక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు సైతం మరమ్మతులకు గురవుతున్నాయి. ఇప్పటికే గుంతల్లో పడి గాయాల పాలైన ఘటనలు ఉన్నాయి. అయినా గుంతలను పూడ్చడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.